క్లుప్తంగా

రేపు వాహనాల వేలం

పరకాల : ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు రేపు (బుధవారం) వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ తాతాజీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు పరకాల ఎక్సైజ్ స్టేషన్‌లో అప్‌సెట్ ప్రైస్‌పై 50 శాతం డిపాజిట్‌గా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

ఉరేసుకుని యువతి ఆత్మహత్య


చాపర్తి అనూష (ఫైల్)

నడికూడ : ఉరేసుకుని యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన చాపర్తి అనూష (23) పీజీ పూర్తి చేసింది. కాగా నాలుగేళ్లుగా మానసికంగా బాధపడుతూ ఉండేది. ఆదివారం కుటుంబ సభ్యులతో గొడవపడి, మనస్థాపం చెందిన ఆమె.. ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాద కారకుడికి జైలు

శాయంపేట : మండలంలోని ప్రగతి సింగారం గ్రామానికి చెందిన బయగాని సాంబయ్యకు హనుమకొండ కోర్టు రెండేళ్ల జైలుశిక్ష విధించినట్లు ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ప్రగతిసింగారం గ్రామానికి చెందిన బయగాని సాంబయ్య 2015వ సంవత్సరంలో కొత్తగట్టు సింగారం నుంచి మాందారిపేటకు వస్తున్నాడు. ఈ క్రమంలో సాంబయ్య తన వాహనాన్ని నిర్లక్ష్యంగా అతివేగంగా, నడిపి ఇద్దరి మృతికి కారణం అయ్యాడు. దీంతో అప్పటి ఎస్సై ప్రవీణ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రస్తుత ఎస్సై జక్కుల పరమేశ్ దర్యాప్తులో నిందితుడు సాంబయ్యకు సోమవారం హనుమకొండ కోర్టు రెండేళ్ల జైలుశిక్షతో పాటు రూ. 5,000 జరిమాన విధించినట్లు ఎస్సై పరమేశ్ తెలిపారు.

అరుణ కీర్తికి గజల్ పురస్కారం

హన్మకొండ అర్బన్: నగరానికి చెందిన కవి, రచయిత, గజల్ గాయని గంకిడి అరుణ కీర్తికి గజల్ జాతీయ పురస్కారం అందజేశారు. విశ్వపుత్రిక గజల్ ఫౌండేషన్ గజల్ సాహితీ సంస్థ వార్షికోత్సవం సందర్భంగా విశ్వపుత్రిక గజల్ ఫౌండేషన్, భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 29న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ విజయలక్ష్మి పండిట్, డాక్టర్ బిక్కి కృష్ణ నుంచి పురస్కారాన్ని అరుణ కీర్తి స్వీకరించారు.

కేయూ సోషల్‌సైన్స్ డీన్‌గా ప్రొఫెసర్ సురేష్‌లాల్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ సోషల్‌సైన్స్ డీన్‌గా ఎకనామిక్స్ విభాగం ప్రొఫెసర్ సురేష్‌లాల్ నియమితులయ్యారు. ఈ మేరకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం సోమవారం ఉత్తర్వులు జారీచేయగా వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి అందజేశారు. ఇప్పటివరకు సోషల్ సైన్స్‌డీన్‌గా, ఆర్ట్స్ విభాగం ఇన్‌చార్జ్ డీన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న హిస్టరీ విభాగం ప్రొఫెసర్ మనోహర్ పదవీకాలం పూర్తికావటంతో ఆయన స్థానంలో సురేష్‌లాల్‌ను నియమించారు.

కేయూ ఇంగ్లిష్ విభాగం అధిపతిగా మేఘనరావు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఇంగ్లిష్ విభాగం అధిపతిగా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మేఘనరావు నియమితులయ్యారు. ఈ మేరకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటివరకు ఆ విభాగం అధిపతిగా డాక్టర్ దీపాజ్యోతి బాధ్యతలు నిర్వర్తించారు. ఆమె పదవీకాలం పూర్తికావడంతో మేఘనరావును నియమించారు.

ఎన్‌సీసీ ఎయిర్‌వింగ్ సీనియర్ కేడెట్‌కు అభినందన

కేయూ క్యాంపస్: దుండిగల్‌లోని ఎయిర్‌ఫోర్స్ అకాడమీ అటాచ్‌మెంట్ క్యాంపులో హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎన్‌సీసీ ఎయిర్‌వింగ్ సీనియర్ కేడెట్ అరవింద్ పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు కళాశాలలో అరవింద్‌ను ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి, అధ్యాపకులు సోమవారం అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ అధికారి ఫ్లయింగ్ ఆఫీసర్ డాక్టర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మిట్టపల్లి భాస్కర్‌కు సన్మానం

హన్మకొండ కల్చరల్: లష్కర్‌బజార్ రామమందిర్, గోవిందరాజుల గుట్ట, వేణుగోపాలస్వామి దేవాలయాల్లో కార్యనిర్వహణాధికారిగా విధులు నిర్వర్తించిన మిట్టపల్లి భాస్కర్ పదవీ విరమణ కార్యక్రమం వరంగల్ జోన్ దేవాదాయ శాఖ కార్యాలయంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత, తెలంగాణ రాష్ట్ర అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా హైవే

- గుంతలమయంగా గుడెప్పాడ్ జంక్షన్
- యూటర్న్‌ల వద్ద కానరాని ఆటోమేటిక్ సిగ్నల్ సిస్టం
- నత్తనడకన కటాక్షపూర్ బ్రిడ్జి నిర్మాణం
- పట్టించుకోని పాలకులు, అధికారులు


గుడెప్పాడ్ జంక్షన్ వద్ద ప్రమాదకరంగా ఉన్న గుంతలు


కొనసాగుతున్న కటాక్షపూర్ బ్రిడ్జి పనులు

ఆత్మకూరు : మండల పరిధిలోని 163 జాతీయ రహదారి నిర్వహణ అధ్వానంగా మారింది. మండలంలోని గుడెప్పాడ్ జంక్షన్ వద్ద గుంతలు ఏర్పడి ఏడాది గడుస్తున్నప్పటికీ మరమ్మతులు చేపట్టడం లేదని వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ జంక్షన్ నుంచి నిత్యం పరకాల, ఏటూరునాగారం, హనుమకొండ వైపు సాధారణ వాహనాలతో పాటు భారీ వాహనాలు వెళ్తుంటాయి. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వెంటనే పాలకులు, అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

కానరాని ఆటోమేటిక్ సిగ్నల్స్

మండల పరిధిలోని హైవేపై ఏర్పాటు చేసిన యూటర్న్‌ల వద్ద ఆటోమేటిక్ సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు. యూటర్న్‌లు శాస్త్రీయంగా లేకపోవడంతో వాహనాలు రోడ్డు దాటేందుకు ఇబ్బందులు తప్పడం లేదని అంటున్నారు. అలాగే రోడ్డు దాటేందుకు పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా యూటర్న్‌ల వద్ద సిగ్నల్ సిస్టం ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

నత్తనడకన బ్రిడ్జి నిర్మాణ పనులు

మండలంలోని కటాక్షపూర్ చెరువు మత్తడి వద్ద బ్రిడ్జి నిర్మాణ పనులు ఇటీవల ప్రారంభించారు. రోడ్డుపై నుంచే మత్తడి పారుతుండడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదని వాహనదారులు వాపోగా.. ఎట్టకేలకు బ్రిడ్జి నిర్మాణానికి నిధులు విడుదలై అనుమతులు రాగా పనులు ప్రారంభించారు. వర్షాకాలం సమీపించి కాలం ముందుకు వెళ్తున్నప్పటికీ బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకనే సాగుతున్నాయి. హైవేపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు త్వరితగతిన పూర్తిచేయాలని స్థానికులు, వాహనచోదకులు కోరుతున్నారు.

వెలగని విద్యుత్ లైట్లు

మండల కేంద్రంలో జాతీయ రహదారిపై ఐదురోజులుగా సాంకేతిక కారణాలతో విద్యుత్ లైట్లు వెలగడం లేదు. దీంతో రోడ్డు అంధకారంగా మారుతోంది. రాత్రి సమయంలో ప్రయాణం ఇబ్బందికరంగా మారుతుందని, లైట్లు వెలిగే విధంగా చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

దళిత కాలనీని ముంపు నుంచి కాపాడాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

శాయంపేట : మండలంలోని మైలారం గ్రామంలో గల పెద్దచెరువు కట్ట మరమ్మతు చేపట్టడంతో చెరువు విస్తీర్ణం తగ్గి ఎస్సీ కాలనీలోకి నీరు చేరి ముప్పునకు గురవుతుందని, అధికారులు చర్యలు చేపట్టి ఎస్సీ కాలనీని కాపాడాలని బీఎస్‌ఎస్ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు అరికిల్ల దేవయ్య మాట్లాడుతూ.. కట్ట మరమ్మతు చేయడం వలన పెద్ద చెరువు విస్తీర్ణం తగ్గి ఎస్సీ కాలనీ ముప్పునకు గురవుతుందని అన్నారు. కొన్ని సందర్భాల్లో ఇంట్లోని నిత్యవసర వస్తువులు నీట మునిగి ఆర్థికంగా నష్టపోయామని వాపోయారు. ఎస్సీ కాలనీ ప్రజలు ఎగువ ప్రాంతాలకు వెళ్లి తలదాచుకుంటున్నట్లు తెలిపారు. పెద్ద చెరువు మరమ్మతు చేపట్టిన కాంట్రాక్టర్ తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బహుజన సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మొగ్గం సుమన్, హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు మారెపల్లి విజయ్ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్యకు ప్రభుత్వానిదే బాధ్యత



పరకాల : మల్లక్‌పేట సోషల్ వేల్ఫేర్ రెసిడెన్షియల్‌లో పదో తరగతి విద్యార్థినీ ఆత్మహత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గురుకులాల్లో విద్యార్థుల ఆత్మహత్యలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థినీ శ్రీవాణి ఆత్మహత్య గురించి తెలుసుకునేందుకు ఓ అధికారికి ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం చూస్తుంటే అధికారులు బాధ్యత రహితంగా ఉన్నారో స్పష్టం అవుతుందని మండిపడ్డారు. బాధిత కుటుంబానికి అండగా నిలిచి నిందితులకు కఠిన శిక్ష పడేవరకు న్యాయ పోరాటం చేస్తామని తెలిపారు.

మొరం తరలింపుపై చర్య తీసుకోవాలి


వినతిపత్రం సమర్పిస్తున్న తిరుపతి

దామెర : అక్రమంగా మొరం తరలిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని పలు గ్రామాల్లో క్రషర్ నిర్వహణ కోసం అనుమతులు తీసుకుని మొరం తరలిస్తున్నట్లు ఆరోపించారు. గుట్టల్లోని సహజ సంపదను దోచుకుంటున్నారని ఆరోపించారు. అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్న అక్రమార్కులను గుర్తించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని వినతిలో కోరారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మట్టి తరలిస్తున్నామని చెబుతూ ఇతర అవసరాలకు మట్టిని తరలిస్తున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు అంతా డిజిటల్‌మయమే

నయీంనగర్: సమస్యలపై సంఘటితంగా పోరాడుదామని, డిజిటల్ మీడియా అని చిన్నచూపు చూస్తే ఊరుకునేది లేదని వరంగల్ డిజిటల్ మీడియా ఎడిటర్లు అన్నారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఓరుగల్లు డిజిటల్ మీడియా ఎడిటర్ల సమావేశం వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా డిజిటల్ పేపర్లకు రాజకీయంగా, ప్రభుత్వ అధికారుల నుంచి రావాల్సిన గుర్తింపుపై చర్చించారు. రానున్న రోజుల్లో అన్ని పత్రికలు డిజిటల్ వైపే చూస్తాయని తెలిపారు. అనంతరం ఓరుగల్లు డిజిటల్ మీడియా ఎడిటర్స్ సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం సలహాదారులుగా నేటిధాత్రి ఎడిటర్ కట్ట రాఘవేందర్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజును ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా గడ్డం కేశవమూర్తి, ఉపాధ్యక్షులుగా చేలిక రాజేంద్రప్రసాద్, పల్లె రవివంశీమోహన్, బొల్లెపల్లి కిషన్, ప్రధాన కార్యదర్శిగా వేముల రాజేశ్వర్ రావు, సహాయ కార్యదర్శులుగా దామెర రాజేందర్, సుంకరనేని నర్సయ్య, బాదావత్ బాలాజీ, సాంస్కృతిక కార్యదర్శిగా యాంసాని శ్రీనివాస్, కోశాధికారిగా కొడగాని మోహన్‌రావు, మీడియా ఇన్‌చార్జ్‌గా నాగరాజు, కార్యవర్గ సభ్యులుగా రావుల రాజేశం, కృష్ణ, ప్రభాకర్‌రావు, వెంకటస్వామి, మధుసూదన్, రాజు, జనార్దన్, కిరణ్, రాజిరెడ్డిని ఎన్నుకున్నారు.

ఉద్యోగ విరమణ సహజం


ధర్మసాగర్ : చీరలు పంపిణీ చేస్తున్న మల్లారెడ్డి


ఐనవోలు : కృష్ణమూర్తిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

- ఎంపీడీఓ, ఎంఈఓ

ధర్మసాగర్ : ఉద్యోగులకు ఉద్యోగ విరమణ సహజమని ఎంపీడీఓ అనిల్ కుమార్, ఎంఈఓ రామ్‌ధన్ అన్నారు. మండలంలోని పెద్ద పెండ్యాల ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న మల్లారెడ్డి సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడారు. హెచ్‌ఎం మల్లారెడ్డి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న స్కావెంజర్లకు, వంట కార్మికులకు చీరలు, విద్యార్థులకు టీషర్ట్, ట్రాక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఐనవోలు : మండలంలోని పంథిని జెడ్పీహెచ్‌ఎస్ ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తూ, 38 సంవత్సరాలుగా వివిధ పాఠశాలల్లో సేవలందించిన కీసర వెంకటరామిరెడ్డి, కక్కిరాలపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తూ, 36 సంవత్సరాలుగా వివిధ పాఠశాలల్లో సేవలందించిన రాయపురి కృష్ణమూర్తి సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా తోటి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు వారికి సన్మానించి ఘన వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వారు పాఠశాలకు అందించిన సేవలకు పలువురు కొనియాడారు. ఎంఈఓ పులి ఆనందం, హెచ్‌ఎంలు రామకృష్ణ, సుదర్శన్, రాజు, యూసఫ్‌పాషా, మధుసూదన్‌రెడ్డి, శ్రీదేవి, వేణుగోపాల్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో 72గంటల బంద్

విద్యారణ్యపురి: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల ప్రజాస్వామిక విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఆధ్వర్యంలో ఈనెల 2, 3, 4వ తేదీల్లో కళాశాలల (డిగ్రీ, పీజీ, ప్రొఫెషనల్స్ కోర్సులు) 72గంటల బంద్‌కు పిలుపునిస్తున్నట్లు పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చ మహేష్ తెలిపారు. ఈ మేరకు కేయూ ప్రైవేట్ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ బాధ్యులతో కలిసి హనుమకొండలోని గీతాంజలి డిగ్రీ కళాశాల వద్ద కళాశాలల బంద్ పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేయూ ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ సెక్రటరీ వేణుమాధవ్, బాధ్యులు గోలివెంకట్, కృష్ణమోహన్, రాజేందర్‌రెడ్డి, రవీందర్, తిరుపతిరెడ్డి, కేశవ, శ్రీనివాస్, బాధ్యులు పాల్గొన్నారు.

నాలుగేళ్ల తర్వాత తెరుచుకున్న బడి


అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంఈఓ భిక్షపతి, ఎంపీఓ రంజిత్‌కుమార్

శాయంపేట : మండలంలోని కొప్పుల గ్రామంలో గల గొల్లపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నాలుగుళ్ల క్రితం విద్యార్థులు లేకపోవడంతో మూతబడింది. కాగా ఈ ఏడాది బడిబాటలో ఎంఈఓ భిక్షపతి, ఎంపీఓ రంజిత్‌కుమార్ పాల్గొని విద్యార్థులను చేర్పించాలని వారి తల్లిదండ్రులను కోరడంతో ప్రభుత్వ పాఠశాలలో చేరారు. ఈ మేరకు పాఠశాలను పునఃప్రారంభించాలని ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగా సోమవారం వారు ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య లభిస్తుందని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని కోరారు. అనంతరం పిల్లలతో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఎంఈఓ భిక్షపతిని స్థానికులు అభినందించారు.

'కేంద్ర ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమం'

వరంగల్: దేశ ప్రయోజనాలు, ప్రతిష్టను అమెరికాకు తాకట్టు పెడుతున్న కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వ విధానాలపై ఉద్యమించాలని ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలీఉల్లా ఖాద్రీ పిలుపునిచ్చారు. జూలై 2న నిర్వహించనున్న చలో అమెరికా రాయబార కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయాలని కోరారు. ఎల్బీనగర్‌లోని సోమవారం నిర్వహించిన సమావేశంలో ముట్టడి పోస్టర్‌ను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. పీఎం నరేంద్రమోదీ విధానాలు దేశానికి ప్రమాదకరమని అన్నారు. దేశాన్ని తిరోగమన దిశలో తీసుకెళ్లే విధానాలను అనుసరిస్తూ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. అమెరికా ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లొంగిపోయారని విమర్శించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి మస్కా సుధీర్ పాల్గొన్నారు.

'కేయూ భూములు కేటాయించొద్దు'

కేయూ క్యాంపస్: యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి కాకతీయ యూనివర్సిటీ భూములు కేటాయించొద్దని కేయూలోని వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కాకతీయ యూనివర్సిటీలోని పరిపాలన భవనం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి కేయూ భూమిని కేటాయిస్తూ కేయూ పాలక మండలి ఆమోదించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సూచించారు. యూనివర్సిటీ భూములు అన్యాక్రాంతం కాకుండా వర్సిటీ చుట్టూ ప్రహరీ నిర్మించాలని కోరారు. ధర్నా కార్యక్రమంలో ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం నాగార్జున, డీఎస్‌ఏ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్, పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మహేష్, బీఆర్‌ఎస్‌వీ కేయూ ఇన్‌చార్జ్ రాజేందర్, పీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జయసూర్య పాల్గొన్నారు.

రుణాల మంజూరులో వేగం పెంచాలి

- టీజీక్యాబ్ చైర్మన్ రవీందర్‌రావు


మాట్లాడుతున్న రవీందర్‌రావు

ఐనవోలు : మరింత వేగవంతంగా రైతులకు పంట రుణాలు మంజూరు చేయాలని నందనం సొసైటీ, టీజీక్యాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అధికారులకు సూచించారు. సోమవారం మండలంలోని నందనం సొసైటీ కార్యాలయంలో పాలకవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సొసైటీ ఆర్థిక లావాదేవీలపై ఆరా తీశారు. కర్షకమిత్ర, నూతన పంట, బంగారు రుణాల వితరణ, రుణమాఫీ, కొనుగోలు కేంద్రాలపై సమీక్ష నిర్వహించి మాట్లాడారు. సొసైటీ నుంచి రూ.20 కోట్లకు పైగా వివిధ రకాల రుణాలు రైతులకు అందించినట్లు చెప్పారు. అలాగే మండల కేంద్రంలో సొసైటీ తరఫున గ్యాస్ ఏజన్సీ ఏర్పాటు, కామన్ సర్వీస్ సెంటర్(సీఎస్‌సీ) ఏర్పాటు చేయాలని తీర్మాణం చేసినట్లు చెప్పారు. సమావేశంలో సొసైటీ వైస్ చైర్మన్ తక్కళ్లపల్లి చందర్‌రావు, డైరక్టర్లు రాజారపు రాజ్‌కుమార్, మేట చిరంజీవి, బిర్రు పద్మ, కలకోట ఎలేంద్ర, చింత బాబు, పూజారి రాంచందర్, బొమ్మినేని బుచ్చిరెడ్డి, ఐనవోలు బ్రాంచ్ మేనేజర్ శ్రావణ్‌కుమార్, సీఈఓ సంపత్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితం నాశనం

- ఎస్సై కొంక అశోక్


మాట్లాడుతున్న ఎస్సై అశోక్

దామెర : మత్తు పదార్థాలతో జీవితం నాశనం అవుతుందని, యువత మత్తుకు దూరంగా ఉండాలని ఎస్సై కొంక అశోక్ సూచించారు. మండల కేంద్రంలో సోమవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జాగృతి కళా బృందంచే కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల నివారణ, సాంఘిక దురాచారాల నిర్మూలన, రోడ్డు భద్రతా నియమాలు, ఫ్రెండ్లీ పోలీసింగ్, సైబర్ నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, శాంతి భద్రతల పరిరక్షణపై పాడిన పాటలు పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం ఎస్సై మాట్లాడుతూ.. యువత గుట్కా, మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని అన్నారు. చెడు అలవాట్లకు బానిసలై వారి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఏఎస్సైలు రాజు, యాకయ్య, రమేశ్, జాగృతి కళా బృందం ఇన్‌చార్జ్, ఏఎస్సై నాగమణి, కళాకారులు విలియమ్స్, వెంకటేశ్వర్లు, రత్నయ్య, శ్రీనివాస్, విక్రమ్, చిరంజీవి, పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు.

'క్షయ' నివారణకు జాగ్రత్తలు పాటించాలి


టీబీ అనుమానితులను పరీక్షలకు తరలిస్తున్న సిబ్బంది

దామెర : క్షయ వ్యాధి (టీబీ) నివారణకు జాగ్రత్తలు పాటించాలని పీహెచ్‌సీ డాక్టర్ జాస్మిన్ మెహెరా సూచించారు. స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని ఊరుగొండ, పులుకుర్తి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కేంద్రాల్లో సోమవారం టీబీ ఆక్టివ్ కేస్ ఫైండింగ్ కార్యక్రమంలో భాగంగా 85 మంది నుండి నమూనాలు సేకరించారు. పరీక్షించిన అనంతరం 12 మంది అనుమానితులను 102 వాహనంలో హనుమకొండలోని ప్రభుత్వ జాతీయ క్షయ దవాఖానకు తదుపరి పరీక్షల నిమిత్తం తరలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్షయ వ్యాధి లక్షణాలు కలిగిన వారు వెంటనే పీహెచ్‌సీలో లేదా ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలను సంప్రదించాలని అన్నారు. ప్రారంభ దశలో క్షయవ్యాధిని గుర్తిస్తే చికిత్స ద్వారా నయం చేయవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీఎస్ శ్రీనివాస్, ఎల్‌టీ జనార్దన్, సూపర్‌వైజర్ శ్రీకాంత్, పద్మ, శోభారాణి పాల్గొన్నారు.

మహాసభకు గొల్ల, కురుమలు తరలిరావాలి


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ధర్మసాగర్ : గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం హనుమకొండ జిల్లా 3వ మహాసభను కాజీపేటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఈనెల 4న నిర్వహించనున్నట్లు ఆ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు తొట్టె భీమన్న, మామిడి కుమార్ తెలిపారు. ఈ మహాసభకు గొల్ల, కురుమలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వం గొర్రెలు, మేకల పెంపకందారులకు గొర్రెల పంపిణీ చేస్తామని ప్రకటించి రెండో విడత పంపిణీ చేయకుండా డీడీలు స్వీకరించి మోసం చేసిందని ఆరోపించారు. గత ప్రభుత్వం గొర్రెలు పంపిణీ చేయలేదని, తాము అధికారంలోకి వస్తే రెండు లక్షల రూపాయలు మూడు నెలల్లో నగదు బదిలీ చేస్తామని ఎన్నికల ముందు కామారెడ్డిలో జరిగిన సభలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా నెరవేర్చలేదన్నారు. మృతిచెందిన కాపర్లకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చి, గొర్రెలకు, మేకలకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, 50 సంవత్సరాలు దాటిన అందరికీ నెలకు రూ.5,000 పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా ప్రముఖ జానపద కళాకారుడు వరంగల్ శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కిల్లె గోపాల్, ఉడుత రవీందర్, ప్రొఫెసర్లు, కార్పొరేటర్లు హాజరుకానున్నట్లు తెలిపారు. అనంతరం మహాసభ వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు.

ఎన్నికల హామీలు వెంటనే నెరవేర్చాలి


కమలాపూర్ : శాంతియుత దీక్ష చేస్తున్న తెలంగాణ ఉద్యమకారులు


శాయంపేట : శాంతియుత దీక్షలో పాల్గొన్న ఉద్యమకారులు

కమలాపూర్ : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల ప్రధాన కార్యదర్శి కత్తి రమేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట శాంతియుత దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో అధికారంలోకి రాగానే తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, పింఛన్, ఉద్యమకారులుగా గుర్తింపు కార్డులు ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం కోశాధికారి తుమ్మ శోభన్ బాబు, నాయకులు నకీర్త ఓదెలు, ఎండీ.సలీం, వల్లంపట్ల నర్సయ్య, కొమురయ్య పాల్గొన్నారు.

శాయంపేట : తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో సోమవారం శాంతియుత దీక్షలు చేపట్టారు. దీక్షకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెన్నంపల్లి పాపయ్య, తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి సాంబయ్య, మాజీ జెడ్పీటీసీ నారాయణరెడ్డి, సీపీఎం జిల్లా నాయకులు ఐలయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు దేవయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రతాప్‌సేనారెడ్డి, జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కొమురయ్య సంఘీభావం తెలిపారు. అనంతరం తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమకారుడు బలిజె నర్సింహారాములు, ఇమ్మిడిశెట్టి రవీందర్‌లు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని సూచించారు.